దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి

కౌడిపల్లి: బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేస్తున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, మే 31: రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి నాయకులు, ప్రజ లు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పద్నాలుగేండ్లు పోరాడి సాధించుకున్న తెలంగాణ లో పదేండ్లు కేసీఆర్ అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపారన్నారు. హైదరాబాద్ లోని గన్‌పార్క్ నుంచి సెక్రటేరియట్ ఎదురుగా ఉన్న అమరవీరుల స్తూపం వరకు శనివారం ర్యాలీ ని ర్వహిస్తున్నట్లు తెలిపారు. ర్యాలీని బీఆర్ఎస్ శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు.

ఎల్‌వోసీ అందజేసిన ఎమ్మెల్యే

కౌడిపల్లి, మే 31: మండలంలోని ముట్రాజ్ పల్లి గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యురాలు నీరుడి యాదమ్మ కోడలు కల్పన అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్నది. ఆమె ఆపరేషన్‌కు రూ.1.20లక్షల ఎల్‌వోసీని హైదరాబాద్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సునీతా రెడ్డి అందజేశారు. ఎమ్మెల్యేతో ఎంపీటీసీ ప్రవీణ్‌కుమార్, మాజీ వార్డుసభ్యులు ఉన్నారు.

లైసెన్స్‌డ్ డీలర్ల వద్దనే విత్తనాలు కొనాలి

కల్తీ విత్తనాలు, ఎరువులపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈవో రాజశేఖర్

మెదక్ రూరల్, మే31: ప్రభుత్వం నుంచి అనుమతులు పొందిన ఫర్టిలైజర్లలోనే విత్తనాలు, ఎరువులు కొనాలని ఏఈవో రాజశేఖర్ తెలిపారు. మండలంలోని మాగ్దుంపూర్‌లో విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించారు. అ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయశాఖ ద్వారా లైసన్స్ పొందిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనాలన్నారు. బిల్లుపై నంబర్, విత్తన రకం, కొనుగోలు తేదీ, డీలరు సంతకం, రైతు సంతకం ఉండేలా చేసుకోవాలన్నారు. గడువు దాటిన విత్తనాలు, మందుల ప్యాకెట్లు, చిరిగిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాలు కొనొద్దన్నారు. విత్తనాలు కొన్న బిల్లును పంటకాలం పూర్తియ్యేవరకు భద్రపర్చుకోవాలన్నారు. నకిలీ విత్తనాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

పారిశుధ్య కార్మికురాలికి సన్మానం


సాయమ్మ దంపతులను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

నర్సాపూర్, మే 31: నర్సాపూర్ మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికురాలు సాయమ్మ ఉద్యోగ విరమణ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్ శుక్రవారం ఘనంగా సన్మానించారు. పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివని, వారిని గౌరవించడం ప్రతిఒక్కరి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, ఎంపీపీ జ్యోతి సురేశ్‌నాయక్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు భిక్షపతి, నాయకులు మల్లేశం, శ్రీనివాస్ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

దాహార్తిని తీరుస్తున్న అంబలి కేంద్రం

నర్సాపూర్‌లో ప్రజలకు అంబలి పోస్తున్న నాగరాజుగౌడ్

నర్సాపూర్, మే 31: పట్టణంలో ఏర్పాటు చేసిన అంబలి కేంద్రం ప్రజల దాహార్తిని తీరుస్తున్నది. ఎండాకాలం ప్రజలకు వడ దెబ్బ నుంచి రక్షించి, ఆరోగ్యంగా ఉంచేందుకు పట్టణవాసి నాగరాజు గౌడ్ తన తల్లిదండ్రులైన దుర్గప్పగారి కమలమ్మ, వెంకటస్వామిగౌడ్ జ్ఞాపకార్థం ఈ అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి శుక్రవారం నర్సాపూర్‌లో సంత ఉండడంతో అంగడికి వచ్చిన ప్రజలకు అంబలి పంపిణీచేస్తున్నాడు. అంబలి కేంద్రాన్ని కొనసాగిస్తూ స్థానికులు, ప్రజల మన్ననలు పొందుతున్నాడు.

ధూమపానం ఆరోగ్యానికి హానికరం

పెద్దశంకరంపేటలో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి వేదశ్రీ

పెద్దశంకరంపేట, మే 31: ధూమపానం ఆరోగ్యానికి హానికరమని వైద్యాధికారి వేదశ్రీ అన్నారు. శుక్రవారం పెద్దశంకరంపేట ప్రభుత్వ దవాఖానలో ప్రపంచ పొగాకు నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ధూమపాన నివారణకు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది వెంకటేశం, శ్రీదేవి, కమల పాల్గొన్నారు.

గోశాలకు పశుగ్రాసం అందజేత

శివ్వంపేట, మే 31: మండలంలోని దొంతి గ్రామంలో ఉన్న వేణుగోపాలస్వామి గోశాలకు శివ్వంపేట గ్రామానికి చెందిన కొత్త విజయ్‌కుమార్, భార్గవి దంపతులు 100 గడ్డి మోపులను శుక్రవారం అందజేసినట్టు గోశాల నిర్వహకుడు శ్రీనివాస్ గుప్తా తెలిపారు. ఆ దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా పశుగ్రాసం అందజేసినట్లు పేర్కొన్నారు.

5లోగా అమ్మ ఆదర్శ పనులు పూర్తి చేయాలి

- బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి
- బడిబాటలో అధికారులు భాగస్వామ్యం కావాలి
- విద్యా ప్రమాణాలు మెరుగుకు ప్రభుత్వం కృషి
- కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలి
- నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవు
- కలెక్టర్ రాహుల్ రాజ్

టేక్మాల్: ధాన్యం కొనుగోలు కేంద్రంలో వడ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ మునిపాలిటీ: పట్టణంలో ఆవిర్భావ దినోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ మున్సిపాలిటీ, మే 31: ఈనెల 3 నుంచి 19వ తేదీ వరకు బడిబాట కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ హాల్‌లో మండల అభివృద్ధి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో బడిబాటపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సంబంధిత శాఖల సమన్వయం అవసరమన్నారు. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి మౌలిక వసతులు కల్పించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు వారి గ్రామాల్లోని పాఠశాలలను సందర్శించి, అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా చేపడుతున్న సదుపాయాలను పరిశీలించాలని సూచించారు. ప్రతి పాఠశాలకు తాగు నీరు, విద్యుత్తు, పెయింటింగ్, మరుగుదొడ్ల మరమ్మతులు, తదితరి పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. బాలికల పాఠశాలల్లో టాయిలెట్లు నిర్మించనున్నట్లు తెలిపారు. బడిబాటలో ముఖ్యంగా ఐదేండ్లు పైబడిన పిల్లలను పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీటన్నింటికి ప్రణాళికలు రూపొందించి క్షేత్రస్థాయిలో అమలుపర్చాలన్నారు. జిల్లా, మండల, గ్రామస్థాయి కమిటీల ద్వారా బడిబాటను విజయవంతం చేయాలన్నారు. ఇంటింటి ప్రచారంలో ప్రభుత్వ పాఠశాలల గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరిస్తూ నమోదు సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందులో భాగంగా పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులపై దృష్టి సారించి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలు పొందేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో డీఈవో రాధాకిషన్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఎస్‌వో రాజిరెడ్డి, సుదర్శనమూర్తి, ఎంఈవోలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళికి లోబడి ఉత్సవాలు

ఎన్నికల నియమావళికి లోబడి ఈనెల 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో ఆవిర్భావ దినోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ఆవిర్భావ దినోత్సవానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించి, వారి త్యాగాలను స్మరించుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ ఉపన్యాసాలకు చోటులేదన్నారు. కలెక్టర్ వెంట డీఆర్వో పద్మశ్రీ, ఏవో యానుస్, మెదక్ ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ శ్రీనివాస్ ఉన్నారు.

క్రమశిక్షణకు పెట్టింది పేరు సుబ్రమణ్యం

ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరి అని, క్రమశిక్షణకు, అంకితభావానికి పెట్టింది పేరు సుబ్రహ్మణ్యమని కలెక్టర్ అన్నారు. ఓడీపై హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో విధులు నిర్వహించి శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. సుబ్రహ్మణ్యం దంపతులను ఘనంగా సన్మానించారు. పౌర సంబంధాల అధికారి రామచంద్రరాజు, ఏపీఆర్వో బాబురావు, పబ్లిసిటీ అసిస్టెంట్ ప్రదీన్‌కుమార్, పవన్‌సింగ్, భూమయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

టేక్మాల్‌లో..

టేక్మాల్, మే 31: మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రభుత్వ పథకాల అమలు తీరును కలెక్టర్ రాహుల్ రాజ్ శుక్రవారం పరిశీలించారు. మండల కేంద్రం, సాలోజిపల్లి, కాదులూర్ గ్రామాల్లో పథకాల అమలు, వాటి పని తీరును పరిశీలించి, అధికారులకు సూచనలు చేశారు. మండల కేంద్రంలోని ఆగ్రోస్ కేంద్రాన్ని పరిశీలించి, సాగుకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. తదనుగుణంగా పోలీసులు, వ్యవసాయ అధికారులు, డీలర్లు వాటిని అరికట్టాలని ఆదేశించారు. అనంతరం సాలోజ్‌పల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతున్న అమ్మ ఆదర్శ పనులను పరిశీలించారు. ఈనెల 5 లోగా పూర్తి చేయాలని, బడిబాట కార్యక్రమంలో బడి మానేసిన పిల్లలను బడిలో చేర్పించేలా చూడాలని విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. కాదులూర్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి, కేంద్రాల్లో ధాన్యం నిల్వ ఉంచకుండా త్వరగా కొనుగోళ్లు పూర్తి చేయాలని ఆదేశించారు. కొనుగోళ్లలో అవకతవకలకు పాల్పడకుండా చూడాలన్నారు. కలెక్టర్‌తో డీఈవో రాధాకిషన్, సెక్టోరియల్ ఆఫీసర్ సుదర్శన్ మూర్తి, ఎంఈవో నీలకంఠం, వ్యవసాయ సహాయ సంచాలకుడు రాంప్రసాద్, తహసీల్దార్ కృష్ణ. అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

మాణిక్‌ప్రభు జాతరలో కుస్తీ పోటీలు

మఖ్త లక్ష్మాపురంలో కుస్తీ పోటీలు పడుతున్న వస్తాదులు

పెద్దశంకరంపేట, మే 31: మండలంలోని మఖ్త లక్ష్మాపురం గ్రామంలో జరుగుతున్న మాణిక్‌ప్రభు జాతరలో భాగంగా శుక్రవారం కుస్తీపోటీలు నిర్వహించారు. చిన్న, పెద్ద వస్తాదులు ఈ పోటీల్లో పాల్గొని, తమ ప్రతిభ చాటారు. ఆయా మండలాలు, గ్రామాల నుంచి 50 మంది మల్లయోధులు హాజరయ్యారు. పెద్దశంకరంపేట, నారాయణఖేడ్, టేక్మాల్, కంగ్టి, కల్హేర్, నిజామాబాద్ జిల్లా పిట్లం, బిచ్కుంద, నిజాంసాగర్, జూకల్ మహారాష్ట్ర నుంచి ఉద్గీర్ గ్రామానికి చెందిన వస్తాదులు పాల్గొన్నారు. వీరు కుస్తీల్లో తమ ప్రావీణ్యాన్ని చూపించి ప్రజలను ఆకట్టుకున్నారు. కుస్తీ పోటీల్లో గెలిచిన వారికి ఆలయ కమిటీ రూ. 1500 నగదు బహుమతి అందజేశారు. అనంతరం మాణిక్ ప్రభు ఆలయం వద్ద అన్నదానం చేశారు. మాజీ సర్పం చ్ కవితా రమేశ్, ఆలయ కమిటీ సభ్యులు పల్లె కృష్ణ, పల్లె రవి, శ్రీనివాస్, కృష్ణ, శ్రీశైలం, ప్రభాకర్, యాదయ్య, కిష్టయ్య పాల్గొన్నారు.

ఘనంగా గంగాభవానీ శివుడి కల్యాణం

శివుడు-గంగా భవానీదేవి కల్యాణాన్ని నిర్వహిస్తున్న భక్తులు

వెల్దుర్తి, మే 31: వెల్దుర్తిలోని గంగపుత్రుల కులదైవం గంగాభవానీ ఆలయ 36వ వార్షికోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం మొదటి రోజు ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, గణపతిహోమం, ఆలయంలోని గంగాభవానీదేవికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు, విశేషాలంకరణ చేశారు. వేదపండితుల మంత్రోచ్చరణాల మధ్య శివుడు గంగాభవానీ దేవి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సాయంత్రం ఒగ్గు కళాకారులతో గంగాభవానీ దేవి చరిత్రను ఒగ్గుకథ రూపంలో వినిపించారు.

ఎనలేని సేవలందించిన ఘనత రమేశ్‌కే దక్కింది

అదనపు కలెక్టర్ ఉద్యోగ విరమణ సభలో కలెక్టర్ రాహుల్ రాజ్

అదనపు కలెక్టర్ రమేశ్ దంపతులను సత్కరిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ మున్సిపాలిటీ, మే 31: వృత్తితో పాటు సేవా భావంతో ప్రజలకు ఎనలేని సేవలందించిన ఘనత అదనపు కలెక్టర్ రమేశ్‌కే దక్కిందని కలెక్టర్ రాహుల్ రాజ్ కొనియాడారు. జిల్లా అదనపు కలెక్టర్ రమేశ్ ఉద్యోగ విరమణ సందర్భంగా వీడ్కోలు, సన్మాన సభను శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, అదనపు కలెక్టర్ దంపతులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టైపిస్ట్‌గా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించి, ఉన్నత శిఖరాలను అధిరోహించిన గొప్ప వ్యక్తి రమేశ్ అన్నారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ అనేది తప్పనిసరి, చేస్తున్న ఉద్యోగానికి మాత్రమే ఉద్యోగ విరమణ, జీవితానికి మాత్రం కాదన్నారు. ఉద్యోగ విధులు నిర్వహించినన్ని రోజులు ప్రజలతో అధికారులు మన్ననలు పొందినప్పుడే ఉద్యోగ ధర్మానికి సార్థకత లభిస్తుందన్నారు. ఉద్యోగ విరమణ పొందిన అదనపు కలెక్టర్ రమేశ్ మాట్లాడుతూ విధి నిర్వహణలో సహకరించిన ఉద్యోగులు, రాజకీయ, వివిధ సంఘాల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ వీడ్కోలు సన్మాన సభలో ఎస్పీ బాలస్వామి, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అదనపు ఎస్పీ మహేందర్, జిల్లా అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చిల్వర్ గ్రామంలో పాఠశాల పనులు పరిశీలిస్తున్న డీఈవో రాధకిషన్

అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పరిశీలన

అల్లాదుర్గం, మే 31: మండలంలోని చిల్వర్ గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ అమ్మ ఆదర్శ పాఠశాల పనులను డీఈవో రాధాకిషన్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పాఠశాల పనులు నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు. ఈ నెల 5 లోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయనతో ఎంఈవో నీలకంఠం, సెక్టోరియల్ అధికారి సుదర్శన మూర్తి, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఏడుపాయల ఈవోకు ఘనంగా వీడ్కోలు

ఏడుపాయల ఆలయ ఈవో మోహన్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న చైర్మన్ బాలగౌడ్

పాపన్నపేట, మే 31: ఏడుపాయల ఆలయ ఈవో మోహన్‌రెడ్డి శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. గోకుల్ షెడ్‌లో ఆలయ చైర్మన్ బాలగౌడ్, పూజారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్లు పార్సి నరసింహులు, ప్రభాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, నర్సింలుగౌడ్, కాంగ్రెస్ నాయకులు ప్రశాంత్‌రెడ్డి, గోవింద్ నాయక్, ఎంపీటీసీలు విజయ్‌పాటిల్, శ్రీనివాస్, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

కౌడిపల్లిలో ..

కౌడిపల్లి, మే31: తునికి ఆలయ ఈవో మోహన్‌రెడ్డి శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. అనంతరం ఈవో దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలోని సిబ్బంది, పాలకవర్గం దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జి వెంకట్‌రెడ్డి, పూజారి శివ్వప్ప, రాజేశ్ ఉన్నారు.

నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలి

పోతాన్‌శెట్టిపల్లిలో ఉపాధి కూలీల సమావేశంలో మాట్లాడుతున్న ఏవో హరిప్రసాద్

చేగుంట, మే 31: నకిలీ విత్తనాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని, గడువు ముగిసిన విత్తనాలు కొనుగోలు చేయవద్దని మండల వ్యవసాయశాఖ అధికారి హరిప్రసాద్ పేర్కొన్నారు. విత్తన కొనుగోలుపై రైతులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. మండలంలోని పోతాన్‌శెట్టిపల్లి, చేగుంట, మక్కరాజిపేట తదితర గ్రామాల్లో శుక్రవారం ఉపాధి కూలీలు, రైతులతో అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈవోలు శోభారాణి, భువనేశ్వరి, మాధవి, అశోక్‌రెడ్డి, ప్రవీణ్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

చేగుంట, మే 31: గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన ఘటన నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని కందం కుంటలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నార్సింగి జాతీయ రహదారి పక్కన గల కందం కుంటలో సుమారు 35 నుంచి 45 ఏండ్ల గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. రెండు మూడు రోజుల క్రితం కుంటలో పడి మృతి చెందింది. మృతదేహాన్ని రామాయంపేట మార్చురీలో భద్రపర్చినట్లు, 8712657938లో సంప్రదించాలని నార్సింగి ఎస్సై తెలిపారు.

జిల్లాలో పోలీస్ యాక్ట్ అమలు: ఎస్పీ బాలస్వామి

మెదక్ అర్బన్, మే 31: జిల్లాలో శాంతిభద్రతలను దృష్టిలో పెట్టుకుని నెల రోజుల పాటు (జూన్1 నుంచి 30 వరకు) జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ బాలస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు అధికారుల అనుమతి లేకుండా ప్రజలు ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని పేర్కొన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగించేలా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించేలా చట్టవ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదన్నారు. జిల్లా ప్రజలు ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసులు వారికి సహకరించాలని కోరారు.

ఆ టీచర్లు గణితం బోధించాలనడం సరికాదు

మెదక్ మున్సిపాలిటీ, మే 31: ప్రభుత్వ పాఠశాలల్లోని భౌతిక, రసాయన శాస్త్ర టీచర్లు గణితం బోధించాలనడం సమంజసం కాదని ఫోరం ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ మెదక్ డివిజన్ నాయకులు మల్లారెడ్డి, నాగేందర్, ప్రభు, నర్సింలు, పోచయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధం లేని ఆరు, ఏడు తరగతుల గణితం బోధించాలనడంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు.

ఇంటర్‌లో అడ్మిషన్లు ప్రారంభం

వెల్దుర్తి, మే 31: వెల్దుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌లో చేరే విద్యార్థులు తమ సర్టిఫికెట్లతో కళాశాలలో సంప్రదించాలని సూచించారు. నేటి నుంచి ద్వితీయ సంవత్సరం తరగతులు ప్రారంభం కానున్నాయని, విద్యార్థులు తరగతులకు హాజరు కావాలని సూచించారు.

జడ్పీటీసీ ఆర్థికసాయం

శివ్వంపేట, మే 31: రోడ్డు ప్రమాదంలో శివ్వంపేటకు చెందిన కిచనోళ్ల వినయ్ కాలుకు తీవ్ర గాయమైంది. దీంతో శుక్రవారం దవాఖాన ఖర్చుల నిమిత్తం జడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయనతో మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, మాజీ వార్డుసభ్యులు కొండల్, రాజు, వెంకటేశ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు లక్ష్మీనర్సయ్య, నాయకులు రామాగౌడ్, అశోక్ ఉన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

రేగోడ్, మే 31: కారు కిస్తీలు కట్టాలని అడిగితే చంపేస్తామని బెదిరించిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు రేగోడు ఎస్సై రాజయ్య శుక్రవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మర్పల్లి గ్రామానికి చెందిన సార అశోక్, తన కారును హైదరాబాద్ వాసి కామ్లే రవీంద్రకు అమ్మాడు. ఒప్పందం ప్రకారం రవీంద్ర కారు కిస్తీలు కట్టడంలేదు. దీంతో కారు కిస్తీలు కట్టాలని అడగగా అశోక్‌ను బెదిరించాడు. ఈ విషయంలో హైదరాబాద్‌కు చెందిన ఒక టీవీ విలేకరి శ్రీకాంత్‌రెడ్డి కూడా బెదిరించాడు. కారు కిస్తీలు కట్టకుండా బెదిరిస్తున్నాడని అశోక్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇద్దరిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సౌతాఫ్రికాలో కొంతాన్‌పల్లి వాసి మృతి

తేజ (ఫైల్)

శివ్వంపేట, మే 31: సౌతాఫ్రికాలో శివ్వంపేట మండలం కొంతాన్‌పల్లి గ్రామానికి చెందిన కీర్తితేజ(42) మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంతాన్‌పల్లికి చెందిన నర్సాపూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గరిటపాటి రాంప్రసాద్ చిన్న కుమారుడు కీర్తితేజ (42) సౌతాఫ్రికాలోని రువాండలో గుండెపోటుతో మృతి చెందాడు. కీర్తితేజ మరణ వార్త తెలుసుకున్న కుటుంబసభ్యులు కన్నీటిపర్యాంతమయ్యారు. నేడు బోయిన్‌పల్లిలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

కొండగట్టుకు స్వాములు

నర్సాపూర్/వెల్దుర్తి, మే 31: మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన హనుమాన్ స్వాములు స్థానిక హనుమాన్ ఆలయం వద్ద పూజలు చేసి కట్టుకుని కొండగట్టుకు బయలుదేరారు. వెల్దుర్తి స్వాములు మాల విరమణకు భద్రాచలానికి తరలివెళ్లారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

★గజ్వేల్ టౌన్ మెయిన్ రోడ్, SBI దగ్గర 161 చ.గ. ఇంటి స్థలం అమ్మబడును. వివరాలకు సంప్ర: 8143366630 / 9989554915.
NT-334218

WANTED

★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-327724-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.